ప్రజాశక్తి
మంగళవారం 25 ఫిబ్రవరి 2025
5
కాకినాడ

పిఠాపురంలో జనసేన ఆధ్వర్యంలో కూటమి అభ్యర్థి తరుపున సోమవారం పలు పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో జనసేన నాయకులతో పాటుగా పిఠాపురం మున్సిపల్ కమిషనర్ ఎన్.కనకారావు(వృత్తంలో వ్యక్తి) పాల్గొన్నారు.

నేటితో ప్రచారానికి తెర

27న గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి పోలింగ్
ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

పట్టబద్రుల ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారానికి మంగళవారంతో తెరపడనుంది. ఒక్కరోజే సమయం ఉండటంతో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో ఎన్నికల సందడి జోరందుకుంది. తుది ప్రచారానికి అభ్యర్థులు పదును పెట్టారు. ఈ నెల 27న ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానానికి పోలింగ్ జరుగనుంది. పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు రెండు జిల్లాల్లోనూ అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. పిడిఎఫ్ అభ్యర్థి దిట్ల వీర్రాఘవులతో పాటు మరో 34 మంది బరిలో ఉండడంతో ఈసారి ఎన్నికలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ప్రధానంగా పిడిఎఫ్, కూటమి అభ్యర్థి మధ్య పోటీ నెలకొనడంతో ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది.

ఏర్పాట్లు పూర్తి...సిబ్బంది సిద్ధం

ఉభయగోదావరి జిల్లాల్లో 3,14,984 మంది పట్టభద్రుల ఓటర్లున్నారు. ఇందులో 1,83,347 మంది పురుష ఓటర్లు, 1,31,618 మంది మహిళా ఓటర్లు, 19 మంది ఇతర ఓటర్లున్నారు. ఈనెల 27న పోలింగ్ జరుగనుంది. 35 మంది బరిలో నిలవగా 113 మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. 440 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. పోలింగ్ నిర్వహణకు అవసరమైన సామగ్రిని ఆయా రెవెన్యూ డివిజనల్ కేంద్రాలకు ఇప్పటికే తరలించారు. వాటిని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. వీటిని బుధవారం ఎన్నికల సిబ్బందికి అందజేయనున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో నలుగురు సిబ్బంది, ఒక సూక్ష్మ పరిశీలకులు, ఒక వీడియో గ్రాఫర్‌ను నియమించారు.

ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్

ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 27న జరగనున్న అన్ని కేంద్రాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరుగనుంది. ఎన్నికల్లో ఉపయోగించనున్న బ్యాలెట్ పత్రాల పరిశీలన ఇప్పటికే పూర్తయింది. ఆయా డివిజన్ కేంద్రాల్లో ఉన్న ట్రెజరీల్లో వాటిని భద్రపరిచారు. ఈ సారి ఏకంగా 35 మంది అభ్యర్థులు పోటీలో ఉన్న తరుణంలో బ్యాలెట్ పత్రాలు పెద్ద సైజులో ఉన్నాయి. దీంతో ప్రతి పోలింగ్ కేంద్రాల్లోనూ నాలుగు బ్యాలెట్ బాక్స్‌లను ఏర్పాటు చేయనున్నారు.

తొండంగిలో పిడిఎఫ్ అభ్యర్థి డి.వి.రాఘవులు తరుపున ప్రచారం నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు

యాజమాన్యాలకు ఆదేశాలు

27న జరగనున్న ఎన్నికల నేపథ్యంలో అన్ని ప్రైవేటు యాజమాన్యాలలో ఉన్న ఓటర్లకు ఓటు వేసేందుకు వెసులుబాటు ఇవ్వాలని రిటర్నింగ్ అధికారి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ప్రయివేటు సంస్థల్లో వత్తి, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక, ఇతర రంగాల్లో ఓటర్లున్న నేపథ్యంలో విధులకు ఆలస్యమైనా అనుమతులు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు.

ప్రజాస్వామ్యమే గెలుస్తుంది

నీతి, నిజాయతీ గల అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి డి.వి.రాఘవులు చెబుతున్నారు. తన గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లోనూ విస్తత ప్రచారం నిర్వహించారు. ప్రజాసంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, కార్మిక, ఫెన్షనర్ల సంఘాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు మద్దతుతో ఆయన ప్రచారం చేశారు.

అధికార పార్టీకి క్షేత్రస్థాయిలో ప్రతికూల వాతావరణమే కనిపిస్తుంది. కూటమి సర్కారు అధికారం చేపట్టి తొమ్మిది నెలలు గడుస్తున్నప్పటికీ ఎటువంటి హామీలను అమలు చేయలేదు. ప్రధానంగా నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లేలా వ్యవహరిస్తోంది. ఉద్యోగాల కల్పన, నిరుద్యోగులకు భృతి వంటి హామీలను విస్మరించింది. ఉపాధి అవకాశాలు కల్పించలేకపోవడంతో నిరుద్యోగుల్లో ప్రభుత్వం పట్ల సానుకూల వాతావరణం కనిపించట్లేదు. మరోవైపు ప్రజలకిచ్చిన హామీలను సైతం అమలు చేయడానికి డబ్బులు లేవని, గత ప్రభుత్వ వైఫల్యం అంటూ సాకులు చెబుతూ తప్పించుకుని తిరుగుతున్న పరిస్థితిని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు.. ఈ నేపథ్యంలో జరుగుతున్న గ్రాడ్యుయేట్స్ ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికార పార్టీకి ఓటమి భయం పట్టుకుంది. అందుకే కొన్ని అడ్డదారులు తొక్కే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా దూర ప్రాంతంలో ఉన్న వారిని ఇక్కడికి రప్పించేందుకు ట్రాన్స్ పోర్ట్ చార్జీలను భరిస్తున్నారు. చివరి రెండు రోజుల్లో భారీ ఎత్తున ప్రలోభాలకు గురి చేసేందుకు అధికార పార్టీ రంగం సిద్ధం చేసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఓటర్లను ప్రలోభ పెట్టే చర్యలను అడ్డుకొని తీరతామని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేస్తామని పిడిఎఫ్ సహా, ఇతర అభ్యర్థులు ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ గౌరవాధ్యక్షురాలు బేబీ రాణి

హెల్త్ సూపర్‌వైజర్‌ను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని కాట్రావులపల్లి పిహెచ్‌సికి చెందిన హెల్త్ సూపర్‌వైజర్ కనకరాజును తక్షణమే సస్పెండ్ చేయాలని ఆశా వర్కర్స్ యూని యన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.బేబీరాణి డిమాండ్ చేశారు. సోమవారం జగ్గంపేటలో ఆశా వర్కర్ల యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాట్రావులపల్లి పిహెచ్‌సి పరిధి లో పని చేస్తున్న సీనియర్ ఆశ వర్కర్‌ను కనీస గౌరవం లేకుండా అసభ్యకర పద జాలంతో కనక రాజు దూషిస్తున్నారని అన్నారు. కనకరాజుకు జిల్లా అధికారులు అండగా నిలవడం దారుణమన్నారు. ఇటీవల కనకరాజుపై జిల్లా ఉన్నతాధికారులు విచా రణ చేపట్టారని, అయినా అతనిలో ఎటువంటి మా ర్పు రాలేదన్నారు. జగ్గంపేటకు చెందిన దళిత నాయకుడుగా చెలామణి అవుతున్న పులి ప్రసాద్‌తో కనకరాజు కుమ్మకై ఆశా వర్కర్లను బెదిరింపులకు గురి చేస్తున్నారని అన్నారు. ఉద్యోగాలు తీయించివేస్తామని ఫోన్ చేసి తనకి జనసేన నాయకులతో సంబంధం ఉందని, మిమ్మల్ని ఏమైనా చేయగలను అని బెదిరిం పులు గురి చేస్తున్నారని, ఇటువంటి బెదిరింపులు తక్షణమే ఆపాలని ఆమె డిమాండ్ చేశారు. దీనికి నిరసనగా మార్చి 3న కాంట్రావులపల్లి పిహెచ్‌సి వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో ఆశావర్కర్లు పెద్దఎత్తున పాల్గొని తమ నిర సనను వ్యక్తం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమల్ల పద్మ, మండల ఆశా వర్కర్లు నాయకు రాలు చిత్రడ మంగ, ఏపూరి చిలకమ్మ, వై.మౌనిక, బత్తిన సుశీలరాణి, కమల, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

108 అంబులెన్స్ ఉద్యోగులకు ప్రభుత్వం తరుపున ఉన్నతాధికారులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని 108 ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం డిఆర్‌ఒ, డిఎం హెచ్‌ఒకు ఉద్యోగులు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి.నరసింహారావు, జిల్లా అధ్యక్షులు వివి.సత్యనా రాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.జయరాం మాట్లాడారు. గత ఏడాది నవంబర్ 26న వైద్య ఆరో గ్య శాఖ ముఖ్య కార్యదర్శి, ఇతర ఉన్నత అధికా రులతో జరిగిన చర్చల్లో తమ సమస్యల పరిష్కా రానికి హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీలు నేటికి ఏ ఒక్కటి పూర్తి స్థాయిలో అమలు కాలేదని, వాటిని పూర్తిగా అమలు చేయాలని కోరారు. అత్య వసర, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న వారిని తరలింపు విషయంలో గోల్డెన్ అవర్ కాన్సెప్ట్‌కు సంబంధించి, ఐఎఫ్‌టి కేసుల తరలింపుకు ప్రత్యేక వాహనాల ఏర్పాటుపై స్పష్టత లేకపోవడం కారణంగా గోల్డెన్ అవర్ కాన్సెప్ట్ నీరు గారే ప్రమాదాన్ని నివారించాలన్నారు. ప్రభుత్వం నుంచి ఆ మేరకు ఉత్తర్వులు రాకపోవడంతో అనేకమంది ఉద్యోగాలను కోల్పోతున్నారని అన్నారు. 108 ఉద్యోగుల యూనియన్ నాయకులతో ప్రభుత్వం చర్చలు జరిపి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 108 ఉద్యోగులు పాల్గొన్నారు.

డిఎంహెచ్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న 108 ఉద్యోగులు

తీరు మార్చుకోకపోతే ఇంటికే : కలెక్టర్

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానంలో పనిచేసే ఉద్యోగులు పనితీరు మార్చుకోకపోతే ఇంటికి వెళ్లిపోవాల్సి వస్తాదని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి హెచ్చరించారు. సోమవారం అన్నవరం కొండకు చేరుకున్న కలెక్టర్ క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పనులను ప్రత్యక్ష పరిశీలన చేశారు. తొలుత ఆయన సత్యదేవుని దర్శించుకున్నారు. అనంతరం ఆయన ఇఒ వీర్ల సుబ్బరావు, ఛైర్మన్ ఐవి.రోహిత్‌లతో కలిసి దర్శనం క్యూలైన్లు, ప్రసాదం విక్రయించే కౌంటర్లు, ప్రసాదం తయారు చేసే కేంద్రం, అన్న సంతర్పణ విభాగం, భక్తులు వినియోగించుకునే టాయిలెట్ గదులు, వసతి గదులు ఇచ్చే సిఆర్‌ఒ కార్యాలయాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా దేవస్థానం ఏర్పాటు చేసిన సౌకర్యాలకు సంబంధించి భక్తులను కలిసి మాట్లాడారు. కొన్నిచోట్ల సదుపాయాలు బాగానే ఉన్నా వసతి గదులు ఇవ్వడం లేదని, ప్రతీ ఏడాది వస్తున్నా ఇదే సమస్య ఎదురౌతుందని విజయవాడకు చెందిన ఒక యాత్రికురాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై సంబంధిత అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలా చోట్ల సౌకర్యాలు తెలిపే బోర్డులు లేకపోవడంపై అధికారులను నిలదీశారు. అనంతరం అధికారులతో ఆయా సమస్యలపై అధికారులతో సమీక్షా సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతినెల పరిపాలన అంశాలపై కోఆర్డినేషన్ సమావేశం నిర్వహిస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

సమావేశంలో మాట్లాడుతున్న దాడిశెట్టి రాజా

ప్రజా సమస్యలపై పోరాడుతాం

ప్రజాశక్తి - జగ్గంపేట

ప్రజా సమస్యలపై పోరాడేందుకు తమ నాయకుడు సిద్ధంగా ఉన్నారని వైసిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. సోమవారం ఆయన స్థానిక వైసిపి కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తోట నరసింహం, పార్టీ నాయకులు ఒమ్మి రఘురామ్, తోట రాంజీ, తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లా అధ్యక్షులుగా ఎంపికైన సందర్భంగా తోట నరసింహం ఆశిస్సులు అందుకు నేందుకే వచ్చినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వైసిపి నాయకులను వేధింపులకు గురి చేయడం దారుణమన్నారు. తునిలో ఎస్‌సి మహిళను ఇటీవల వేధింపులకు గురి చేశారని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా కూటమి నాయకులు ప్రవర్తిస్తున్నారని అన్నారు. తమ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీలో సోమవారం అడుగు పెట్టడం జరిగిందన్నారు. ప్రజా సమస్యలపై పోరాడేందుకు తమ అధినేత సిద్ధంగా ఉన్నారని అన్నారు. తోట నరసింహం మాట్లాడుతూ ఇటీవల రాజాపై జరిగిన దాడి దారుణమని, రాష్ట్రంలో అప్రజాస్వామికంగా పాలన సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు రావుల గణేష్‌రాజా, నాయకులు జాగాలు మూర్తి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడేది పిడిఎఫ్ మాత్రమే..

ప్రజాశక్తితో ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రజలు ఎంతో నమ్మకంతో కూటమి ప్రభుత్వానికి ఓటు వేశారు. 9 నెలలు గడుస్తున్నప్పటికీ వారికిచ్చిన హామీలను ఏమాత్రం అమలు చేయలేకపోతున్నారు. ముఖ్యంగా నిరుద్యోగుల సమస్యలను కనీసంగానైనా పట్టించుకోవడం లేదు. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఈ ప్రభుత్వంపై కనిపిస్తుంది. విజ్ఞులయిన పట్టభద్రులు కూటమి అభ్యర్థిని తప్పకుండా ఓడిస్తారు. సొంత ప్రయోజనాలను పక్కనపెట్టి ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా, ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా పిడిఎఫ్ ఎంఎల్‌సిలు నిత్యం ప్రజా పోరాటాలు సాగిస్తున్నారు. ఆ ప్రజలే పిడిఎఫ్ ఎంఎల్‌సిలను మరోసారి గెలిపిస్తారని ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల సిట్టింగ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను ఆయన పంచుకున్నారు.

కూటమి ప్రజావ్యతిరేకతను మూటగట్టుకుంది...

ప్రస్తుతం ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, ఉత్తరాంధ్ర జిల్లాల ఎంఎల్‌సి ఎన్నికలు జరుగుతున్నాయి. మూడు చోట్ల కూటమి పక్షన అభ్యర్థులు పోటీలో నిలిచారు. అధికారంలోకి వచ్చి 9 నెలల గడుస్తున్న ఇచ్చిన హామీలు అమలు చేయడంలో జాప్యం జరుగుతుంది. అది వ్యతిరేక ఓటుగా మారే అవకాశం ఉంది. కూటమిని ఎవరూ కూల్చనక్కరలేదు. దానికి అదే కూల్చేసుకుంటుంది. ప్రజా వ్యతిరేకతే ఆ రకంగా పనిచేస్తుంది. గతంలో కూడా ఇంత చేశాం. అంత చేశామని గొప్పలు చెప్పుకున్న జగన్మోహన్ రెడ్డికి కూడా ఇదే అనుభవం ఎదురైంది. ఆ రకంగా గ్రాడ్యుయేట్స్ స్థానాలు అన్నింటా పాలకపక్షం ఓటమి చవిచూసింది. అధికారంలో ఉన్న వాళ్లు ఎన్ని హామీలిచ్చినా వాటిని అమలు చేయడంలో జాప్యం చేయడం వంటి ఇతర అనేక కారణాలు అధికార పక్షానికి వ్యతిరేక గాలివీచే అవకాశం ఉంది. ఇటువంటి కారణాలతో అధికార పార్టీ అభ్యర్థిని పోటీలో పెట్టిస్తే గెలుపు నల్లేరు మీద నడక అనుకుంటే సాధ్యం కాదు. పిడిఎఫ్ బలమైన పునాది కలిగి, వ్యవస్థీకతమైన ఓటింగ్ కలిగినటువంటి ఒక వ్యవస్థగా నేడు అభివద్ధి చెందింది. అదే పిడిఎఫ్ గెలుపునకు ఒక శుభ పరిణామం.

ప్రజాసమస్యలపై పోరాడే, మాట్లాడే వేదికగా పిడిఎఫ్...

పిడిఎఫ్‌కు వర్గ, ప్రజా సంఘాల మద్దతు పూర్తిగా ఉంది. అదే గెలుపులో కీలక భూమిక పోషిస్తుంది. 2007 నుంచి సుమారు 18 ఏళ్ల పాటు పిడిఎఫ్ తరపున పోటీ చేసిన అభ్యర్థులు గెలిచి ప్రజా సమస్యలపై పోరాడారు. శాసనమండలి బయట, లోపల కూడా ప్రజల ఆంకాంక్షలకు అనుగుణంగా పనిచేశారు. ప్రజల సమస్యలు విని, వినతలు తీసుకొని శాసనమండలిలో గళం వినిపించడం తోబాటు అవసరమైతే దాని మీద ప్రభుత్వానికి లేఖలు కూడా రాశాం. ప్రజా సంఘాలు చేస్తున్న అనేక పోరాట, ఉద్యమాలకు మద్దతుగా నిలిచాం. ప్రత్యక్షంగా పాల్గొంటున్నాం. ఇటువంటి పని ఏ అధికార ప్రతిపక్షమూ కూడా చేయలేదు. అడపాదడపా చేసినా అవి వాళ్ళ రాజకీయ ప్రయోజనాలకు మాత్రమే. లేదా ప్రతిపక్షాలుగా తమ ఉనికి చాటుకునేందుకు బాధితుల తరపున మాట వినిపించి వచ్చారే తప్ప సమస్య పరిష్కారం కోసం నిజాయితీగా కృషి చేసిన దాఖలాలు లేవు.

అందుకే పాలక, ప్రతిపక్షాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరు. అదే పిడిఎఫ్‌కు ప్రయోజనాన్ని చేకూరుస్తుంది. ఎన్నికల రాజకీయాల కోసమో, పదవుల కోసమో, సొంత ప్రయోజనాల కోసమో పిడిఎఫ్ అభ్యర్థులు పోటీ చేయరు. ప్రజా సమస్యలు వినిపించేందుకు, బాధితులకు బాసటగా ఉండేందుకే పిడిఎఫ్ పోటీలో నిలుస్తుందని ప్రజల్లో బలంగా ఉంది. నిజాయితీగా పిడిఎఫ్ పనితీరును గమనించిన ఎవరైనా సరే పాలక, ప్రతిపక్షల వైపు మొగ్గు చూపరు. అటువంటి ఒక బ్రాండ్ ఇమేజ్‌ను క్రియేట్ చేసుకుంది పిడిఎఫ్. ప్రజా సమస్యలపై పోరాడే, మాట్లాడే వేదికగా పిడిఎఫ్‌ను ప్రజలు చూస్తున్నారు.

ప్రజలు చేసిన ప్రతి పోరాటాన్ని బలపరిచాం.

పిడిఎఫ్‌గా అంగనవాడీ, ఆశ, మిడ్ డే మిల్స్, వాలంటీర్లు, నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కర్షకులు మహిళలు, అవుట్సోర్సింగ్, రెగ్యులర్ ఉద్యోగులు, మెడికల్ హెల్త్ డిపార్ట్మెంట్‌లలో పనిచేస్తున్న వారు విద్యార్థులుతోపాటు ఏవైతే వర్గ, ప్రజాసంఘాలు ఉన్నాయో వారు చేసే పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటున్నాం. పిలిస్తే పలికేది పిడిఎఫ్. రమ్మంటే వచ్చేది పిడిఎఫ్. ఆ రకమైన పద్ధతుల్లో మేధో శ్రమజీవులు,శ్రామిక జీవుల పక్షాన పిడిఎఫ్ ఉంటుంది. పిడిఎఫ్ రాజకీయ పక్షము కాదు. రాజకీయ రహితము కాదు. కానీ పిడిఎఫ్ కచ్చితంగా ప్రజా రాజకీయాలు చేస్తుంది. పిడిఎఫ్ ది వ్యక్తిగత విమర్శ కాదు. విధానపరమైన విమర్శ.

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మహిళా సాధికారితతోనే దేశ అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.సునీత అన్నారు. దివాన్ చెరువు డాక్టర్ వినయ్ సుంకరి ఫౌండేషన్ సహకారంతో సోమవారం కళాశాల విద్యార్థులకు మగ్గం వర్క్, కుట్టు, ఇతర చేతివృత్తులపై శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారత తోనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కళాశాల ప్రాంగణంలో 20 రోజులు పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తద్వారా విద్యార్థినులకు విద్యతో పాటు స్వయం ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పురుషులతో సమానంగా స్త్రీలు కూడా సంపాదిస్తేనే కుటుంబం సాఫీగా సాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వినయ్ సుంకరి ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ సుంకరి వెంకటేశ్వరరావు, వృత్తి శిక్షకులు రూప, మీనా, గని లక్ష్మి, కుమారి, తేజ, వైస్ ప్రిన్సిపల్ కె.వెంకటేశ్వరరావు, ఎన్‌ఎస్‌ఎస్ పీడీ డాక్టర్ ప్రగడ ప్రయాగమూర్తి, విమెన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కన్వీనర్ శ్రీలక్ష్మి, మేరీ, రోజలీనా, పుష్ప, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభ సభలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ సునీత

ఆదిత్యలో ఐదు రోజుల వర్క్ షాప్ ప్రారంభం

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో బి.టెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఎంబెడెడ్ సిస్టంపై 5 రోజుల వర్క్ షాప్ సోమవారం ప్రారంభం అయింది. ఎపి స్టేట్ శిక్షణా అభివృద్ధి సంస్థ అధ్వర్యంలో ప్రారంభమైన వర్క్‌షాప్‌లో రిసోర్స్‌పర్సన్‌గా ట్రైనర్ సిహెచ్.సంతోష్ పాల్గొన్నారు. స్మార్ట్ ఫోన్లు, ఎటిఎం, జిపిఎస్, టివి, విద్యా పరికరాలు, కెమెరాలు ఎంబెడెడ్ సిస్టమ్స్ ద్వారానే నడుస్తున్నాయని ఆయన వివరించారు. ఈ నెల 24వ తేదీ నుంచి మార్చి ఒకటో తేదీ వరకూ వర్క్ షాప్ నిర్వాహణ ఉంటుందని ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ డీన్ డాక్టర్ వైకెఎస్.సుబ్బారావు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎం.రవీంద్ర పాల్గొన్నారు.

ప్రతిపక్షానికి తగిన సమయం కేటాయించాలి

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్ర అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న వైసిపి మాట్లాడేందుకు తగిన సమయం కేటాయించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ఏకైక ప్రతిపక్షంగా 11 మంది ఎంఎల్ఎలు ఉన్న వైసిపికి తగిన సమయం కేటాయించకపోవడం ప్రజాస్వామ్యం కాదన్నారు. వైసిపికి ప్రతిపక్ష హోదా ఇవ్వని పక్షంలో ఎంఎల్ఎలు అధికంగా ఉన్న జనసేన పార్టీ ప్రభుత్వం నుంచి బయటకు వచ్చి ప్రతపక్ష పాత్ర పోషించాలని కోరారు.

పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - తాళ్లరేవు

కోరంగి పంచాయతీలో సోమవారం తడి, పొడిచెత్తపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి విజెవి.రమణ ఆధ్వర్యంలో తడి, పొడి చెత్త వేయడానికి అవసరమైన డస్ట్ బిన్‌లను ప్రజలకు పంపిణీ చేశారు. తాగునీటి పొదుపుపై పెద్ద బొడ్డు వెంకటాయపాలెంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం ఈనెల 25వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అజెండాలోని ఒక అంశంపై చర్చ జరుగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆమె కోరారు.

సమస్యలపై నిలదీసిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అజెండాలో ఉన్న రెండు అంశాలపై సరియైన చర్చ లేకుండానే కౌన్సిల్ ఆమోదించింది. కాగా జీరో అవర్ కౌన్సిలర్లు పలు సమస్యలు పై అధికారులను ప్రశ్నించారు. పట్టణంలో మేజర్ డ్రెయిన్‌లలో పూడిక తీత పనులు ఎందుకు నిలిపివేశారని కౌన్సిలర్ కరణం రాజ్‌కుమార్ ప్రశ్నించారు. ఎఇ రమేష్ సమాధానం ఇస్తూ అన్ని పనులు పూర్తయిన తర్వాత మాత్రమే బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. అయితే తాత్కాలికంగా పనులు నిలిపివేశామని, త్వరలోనే పూడిక తీత పనులు ప్రారంభిస్తామని అన్నారు. పట్టణంలో వికలాంగుల పెన్షన్లు కౌన్సిలర్ల దృష్టికి తీసుకు రాకుండా ఎలా తొలగిస్తున్నారని మరో కౌన్సిలర్ నేతల హరిబాబు ప్రశ్నించారు. అధికారుల తీరుపై మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ సైతం అసహనం వ్యక్తం చేశారు. దీనిపై కమిషనర్ శ్రీవిద్య మాట్లాడుతూ పట్టణంలో సుమారు 750 వికలాంగ పెన్షన్‌దారులకు సమాచారం ఇచ్చి పరిశీలన చేస్తున్నట్లు చెప్పారు. అర్హత ఉన్నవారి పెన్షన్లు కొనసాగుతాయని కమిషనర్ స్పష్టం చేశారు. కౌన్సిలర్లను పక్కనపెట్టి రాజకీయ పార్టీల నాయకుల అనుచరులకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదని పలువురు కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. గతంలో మాదిరిగా యథావిధిగా బుధవారం సంత మార్కెట్‌కు కేటాయించిన స్థలంలోనే సంతను నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

కౌన్సిల్లో సమాధానం ఇస్తున్న కమిషనర్ శ్రీవిద్య

విద్యార్థినికి బహుమతులు అందిస్తున్న ఆదిస్

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని వాలు తిమ్మాపురం ఎంపిపి పాఠశాలలో జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా లలిత ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. వివిధ ప్రమాదాలకు సంబంధించి తీసుకోవలసిన జాగ్రత్తలపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీల్లో విజేతలను లలిత ఇండస్ట్రీస్ హెచ్ఆర్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విజేతలు జ్యోత్స్న, సంజన, చరిత, అవంతిక తదితరులకు లలిత ఇండస్ట్రీస్ అధినేత మట్టే శ్రీనివాస్ కుమారుడు ఆదిస్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సైనం బుల్లెమ్మ, గ్రామ కమిటీ నాయకులు సాల్మన్‌రాజు, హెచ్ఎం తేజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ప్రజాశక్తి
www.prajasakti.com

మరో ఆరుగురు కౌన్సిలర్లు టిడిపిలో చేరిక

-పదవికి రాజీనామా చేసిన సుధారాణి
-కౌన్సిల్లో 16కు చేరిన టిడిపి బలం
-చైర్మన్ రేసులో నార్ల భువనేశ్వరి

యనమల సమక్షంలో చేరిన వైసిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి - తుని

తుని మున్సిపాలిటీ పాలకవర్గంలో రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. వైసిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా సొంత నియోజకవర్గంలో వైసిపికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తుని మున్సిపల్ ఛైర్మన్ ఏలూరు సుధారాణి ఛైర్మన్ పదవికి సోమవారం రాజీనామా చేశారు. ఛైర్మన్ పదవికి రాజీనామా చేసిన గంటల వ్యవధిలోనే వైసిపికి చెందిన కౌన్సిలర్లు మంతెన నాగలక్ష్మి, వాసంశెట్టి శ్రీను, సూరిశెట్టి సుభద్రాదేవి, మలిశెట్టి ప్రభావతి, కోలా వెంకటరమణ మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్‌గా ఉన్న కుచ్చర్లపాటి రమాదేవి ఎంఎల్‌ఎ యనమల దివ్య మంతనాలు సాగిస్తున్నారు. ఈమె చేరిక లాంఛనమేనని పార్టీవర్గాలు వెల్లడించాయి. దీంతో టిడిపి బలం 16కు చేరుకోనుంది. సుధారాణి ఛైర్మన్ పదవికి రాజీనామా చేయడంతో నూతనంగా ఛైర్మన్ ఎన్నిక జరగాల్సివుంది. ఈ నేపథ్యంలో టిడిపిలో చేరిన 16 మంది కౌన్సిలర్లతోపాటు, స్థానిక ఎంఎల్‌ఎ యనమల దివ్య కో ఆప్షన్ మెంబర్ ఓటుతో టిడిపి బలం 17కి చేరుకోనుంది. మున్సిపల్ ఛైర్మన్ రేసులో నార్ల భువనేశ్వరి తెరపైకి వచ్చారు. యనమల రామకృష్ణుడుతో కౌన్సిలర్లు భేటీ అనంతరం ఛైర్మన్ పదవిపై ఒక స్పష్టత వచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి.

ప్రజల సంతృప్తి స్థాయి పెంచేలా చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి

ప్రభుత్వ సేవల్లో నాణ్యత, ప్రజల సంతృప్తి స్థాయి పెంచేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సేవల్లో ప్రజాభిప్రాయంపై వివిధ శాఖల జిల్లా అధికారులతో సోమవారం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు అందించడంలో జిల్లాను రాష్ట్రంలో మంచి స్థానంలో నిలిపేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. పారదర్శక పాలన అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఐవిఆర్ఎస్, వాట్సాప్, క్యూఆర్ కోడ్ విధానంలో ఆర్‌టిజిఎస్ ద్వారా ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజల సంతృప్తి స్థాయి నమోదు ఆధారంగా జిల్లాకు, అలాగే ఆయా ప్రభుత్వ శాఖలకు గ్రేడ్‌లు ప్రకటిస్తుందన్నారు. క్రమశిక్షణ, వినయంతో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ప్రభుత్వ సేవలు ప్రజలకు అందించాల్సి ఉందన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాల్సి ఉందని అధికారులకు స్పష్టం చేశారు. హాస్పటల్లో, దేవాలయాలు, మున్సిపాలిటీలు, ఆర్‌టిసి, హెచ్‌ఒడి కార్యాలయాలు, రెవెన్యూ, సర్వే ల్యాండ్స్ రికార్డ్స్, వైద్య సేవలు, పురపాలక సేవలలో పన్నులు, ఇసుక విక్రయాలు, నిత్యవసర సరుకుల పంపిణీ, దీపం-2 పథకం అమలు తీరు తదితర సేవలపై ప్రజాభిప్రాయ సేకరణకు ఐవిఆర్ఎస్, వాట్సాప్, క్యూఆర్ కోడ్ విధానం అమలవుతుందన్నారు. ప్రభుత్వ సూచికలను పరిగణనలోకి తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరులకు కావాల్సిన అన్ని రకాల ధృవపత్రాలు పొందేలా ప్రభుత్వం వాట్సాప్ నెంబర్, క్యూఆర్ కోడ్ ను ఏర్పాటు చేసిందని తెలిపారు. అధికారులు తమ శాఖల్లో ఈ దిశగా సాంకేతికపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వంలో అన్ని సేవలు ఆన్‌లైన్ చేయాలన్నదే ప్రభుత్వం ఆలోచనని, రేషన్ కార్డుల మొదలు అన్నీ కూడా ప్రజలకు చాలా సులభంగా ఆన్‌లైన్‌లోనే అందించే దిశగా అడుగులు వేస్తుందన్నారు. అన్ని శాఖలు వాట్సాప్ గవర్నెన్స్‌లో ఇంటిగ్రేటెడ్ అవ్వాలన్నారు. వాట్సాప్ ద్వారా వివిధ ప్రభుత్వ సేవలు అందాలంటే 95523 00009 నెంబర్ కి వాట్సాప్ లో హాయ్ అని మెసేజ్ చేయాలని, లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా యాప్ ఓపెన్ అవుతుందని కావలసిన పౌర సేవను ఎంచుకోవాలన్నారు. వివిధ సర్టిఫికెట్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదన్నారు. వీటిలో క్యాస్ట్, ఆదాయం, మ్యారేజ్ సర్టిఫికేట్, అడంగల్లు, టైటిల్ డీడ్స్ ఇంకా మరెన్నో సర్టిఫికెట్లు ఈ వాట్సాప్ ద్వారానే పొందవచ్చునని తెలిపారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్.భావన, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్‌డిఒలు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

ప్రజాశక్తి - సామర్లకోట

ఈనెల 26న భీమేశ్వరస్వామి దేవాలయం వద్ద జరిగే మహాశివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి సోమవారం ఓ ప్రకటనలో ఆదేశించారు. 24వ తేదీఉదయం 10 గంటల 15 నిమిషాలకు అంకురార్పణ ధ్వజారోహణ కార్యక్రమాలు, రాత్రి 9.05 నిమిషాలకు స్వామి, అమ్మవారి కళ్యాణం ఉంటుందని ఆయన తెలిపారు. 25వ తేదీ రాత్రి ఒంటి గంట నుంచి 26వ తేదీ రాత్రి 12.30 వరకూ భక్తులకు దర్శనం ఉండేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 27వ తేదీ ఉదయం 6.30 గంటల నుంచి స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు ఉంటాయని చెప్పారు. మధ్యాహ్నం 2.20 గంటల నుంచి స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ నుంచి రథోత్సవం ఉంటుందన్నారు.

శివరాత్రికి ట్రాఫిక్ మళ్లింపు

భీమేశ్వర స్వామి వారి మహ శివరాత్రి మహోత్సవాల సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు సిఐ కృష్ణభగవాన్ తెలిపారు. మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి 27వ తేదీ గురువారం ఉదయం 6 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. ప్రధానంగా రాజానగరం నుంచి కాకినాడ మార్గంలో వెళ్లే భారీ వాహనాలు కత్తిపూడి నుంచి అచ్చంపేట జంక్షన్ మార్గంలో కాకినాడ వెళ్లాల్సి ఉంటుందన్నారు. రాజానగరం, పెద్దాపురం, సామర్లకోట మీదగా కాకినాడ వెళ్లే లైట్ మోటారు వెహికల్స్‌ను, పాసింజర్ ఆటోలు, ఆర్‌టిసి బస్సులు మాత్రమే ఈ మార్గంలో అనుమతిస్తామని తెలిపారు.

మాట్లాడుతున్న సిఐ కృష్ణభగవాన్

కాకినాడ నుంచి రాజా నగరం వైపు వెళ్లే భారీ వాహనాలు కాకినాడ, అచ్చంపేట, కత్తిపూడి మీదుగా రాజానగరం వెళ్లవలసి ఉంటుందన్నారు. కాకినాడ నుంచి రాజానగరం వెళ్లే లైట్ మోటారు వెహికల్స్‌ను, పాసింజర్ ఆటోలు, ఆర్‌టిసి బస్సులు మాత్రమే సామర్లకోట పెద్దాపురం మార్గంలో అనుమతిస్తామన్నారు. ద్వారపూడి, అనపర్తి, బిక్కవోలు నుంచి, సామర్లకోట నుంచి కాకినాడ వెళ్లవలసిన భారీ వాహనాలు సామర్లకోట షుగర్ ఫ్యాక్టరీ నుంచి ఫ్లైఓవర్ మీదగా సామర్లకోట రైల్వే స్టేషన్, పిఠాపురం రోడ్డు నుంచి కాకినాడ మార్గం వైపు వెళ్లాలన్నారు. పెద్దాపురం నుంచి కాకినాడ వెళ్లే భారీ వాహనాలు కూడా ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం జక్షన్ నుంచి బ్రౌన్ పేట, పిఠాపురం మీదుగా వెళ్లాలని తెలిపారు.

క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో మెలగాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మౌనిక

ప్రతి విద్యార్థి చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్ఐ వి.మౌనిక సూచించారు. సోమవారం మండలంలోని రాయభూపాలపట్నం జడ్‌పి హైస్కూల్లో హెచ్ఎం మల్లేశ్వరరావు అధ్యక్షతన సత్ప్రవర్తనపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తోటి విద్యార్థుల పట్ల స్నేహభావంతో మెలగాలన్నారు. మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. మన ప్రవర్తన ద్వారానే మన భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని అన్నారు. తల్లిదండ్రుల పట్ల, ఉపాధ్యాయులు, పెద్దలపట్ల గౌరవభావంతో మెలగాలన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత విద్యావంతుడుగా ఎదిగేందుకు లక్ష్యాలు నిర్దేశించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ మన్యం చిన్న, పిఇటి కె.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డి.వి.రాఘవులును గెలిపించాలని ప్రచారం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

రాఘవులుకు మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి - తొండంగి

తొండంగి మండలంలోని పలు గ్రామాల్లో పిడిఎఫ్ అభ్యర్థి గిడ్ల వీర రాఘవులును గెలిపించాలని ప్రజాసంఘాలు ప్రచారం నిర్వహించాయి. ఈ సందర్భంగా మండలంలో ఉన్న పట్టభద్రుల ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాల్సిన ఆవశ్యకతను ఓటర్లకు వివరించారు. ప్రజల పక్షాన పోరాడేది పిడిఎఫ్ ఎంఎల్‌సిలు మాత్రమేనని గుర్తు చేశారు. మండలంలో ఆటో ప్రచారం చేశారు. పిడిఎఫ్ అభ్యర్థి డి.వి.రాఘవులుకు బ్యాలెట్ పేపర్లో 14 నెంబర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచారం కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కె.సింహాచలం, మచ్చ కామేశ్వరి, సుబ్రహ్మణ్యం, ఎం.యోగి తదితరులు పాల్గొన్నారు

పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలి

ప్రజాశక్తి - సామర్లకోట

విద్యార్థితో మాట్లాడుతున్న డివైఇఒ వెంకటేశ్వరరావు

మార్చి 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులంతా ప్రణాళిక బద్ధంగా సిద్ధం కావాలని డివైఇఒ నాయుడు వెంకటేశ్వరావు సూచించారు. సోమవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ హైస్కూల్లో ఆయన పాఠశాల వార్షిక తనిఖీ నిర్వహించారు. వివిధ సబ్జెక్టు నిపుణులతో కూడిన ప్యానల్ బృందం, విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలను, ఉపాధ్యాయుల బోధనా పటిమను పరిశీలించి నివేదికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమిష్టి కృషితో నూరు శాతం ఉత్తీర్ణతతో పాటు ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థి ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ప్రగతి సాధించడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్జెక్టు నిపుణులు విక్టర్ ప్రేమజ్యోతి, భాస్కర్‌కుమార్, ఎ.నారాయణరావు, మూర్తి, పి.కొండలరావు, జివివి.సత్యనారాయణ, ఉమామహేశ్వరరావు, గంగారాం, బ్రహ్మానందం, ఎంఇఒ - 1 వై.శివరామకృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీలో విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ప్రవాహానికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభం

పట్టణంలో ఎస్‌సి ఏరియాలో మురుగునీరు పారే డ్రెయినేజీ కాలువలలో విద్యుత్ స్తంభాలు దర్శనమిస్తున్నాయి. ఈ విద్యుత్ స్తంభాల వల్ల మురుగునీరు పారడం లేదు. దీంతో ఆ ప్రాంతం దుర్వాసన వ్యాపిస్తుంది. దీనికితోడు దోమలకు ఆవాశంగా మారుతోంది. దీంతో కంటిమీద కునుకు లేకుండా పోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తక్షణమే డ్రెయినేజీలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుక

ప్రజాశక్తి - సామర్లకోట

గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న అంగన్‌వాడీలు

మండలంలోని ఉండూరు జడ్‌పి ఉన్నత పాఠశాల, పట్టణంలోని బచ్చు ఫౌండేషన్ హైస్కూల్స్‌లో నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంఇఒలు పి.పుల్లయ్య, వై.శివరామకృష్ణయ్య పాల్గొన్నారు. ప్రాథమిక విద్య పట్ల చిన్నారులను ఆకర్షితులను చేసేందుకు విద్యా పద్ధతులను అంగన్‌వాడీ కార్యకర్తలతో చేయించారు. మంగళవారం జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన అంగన్‌వాడీలకు జెఎన్‌టియుకె ఆవరణలో వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంఇఒలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్లు మంగ, సత్తార్ బేబీ, నిర్మల కుమారి, వీరలక్ష్మి, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - కరప

మండలంలోని అరట్లకట్ట ముత్యాల సుబ్బయ్య జడ్‌పి హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులకు హైదరబాద్‌కు చెందిన క్షత్రియ యంగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. సోమవారం ఎంఇఒ కెవి.కృష్ణవేణి చేతుల మీదుగా వీటిని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ పి.సత్యనారాయణ మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు ఎటువంటి ఆందోళన లేకుండా పరీక్షలను రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పివి.శివగిరి, ఎస్ఎంసి ఛైర్మన్ దారా వీరబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాట్సాప్ సేవలు ప్రజలకు చేరువ చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

వాట్సాప్ సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేయాలని ఎంపిడిఒ డి.శ్రీలలిత సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ శాఖకు సంబంధించిన క్యూ ఆర్ కోడ్ ప్రజలకు తెలిపి వాట్సాప్ ద్వారా అన్ని రకాల సేవలను పొందేందుకు అవగాహన పెంచాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని 23 గ్రామాల్లో వేసవిలో ఎక్కడా మంచినీటి సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ కె.వెంకట శ్రీరామ్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న 41 మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకులు పూర్తిస్థాయిలో పని చేస్తున్నాయన్నారు. మండల పరిధిలో 190 చేతిపంపులు ఉండగా 85 చేతి పంపులు ప్రస్తుతం పని చేయటం లేదన్నారు. ఈ మొత్తం చేతి పంపులు పనితీరును మార్చి 15 వ తేదీ లోగా పరిశీలించి పూర్తిస్థాయిలో పనిచేసే విధంగా మరమ్మతులు చేపడతామని అన్నారు.

నేరాలు ఘోరాలు

నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఐ

పలు కేసుల్లో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఇటీవల మండలంలో జరిగిన రెండు చోరీల కేసుల్లో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. కోరంగి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ పి.సత్యనారాయణ వివరాలను వెల్లడించారు. ఈ నెల 18వ తేదీ రాత్రి 1 గంట సమయంలో తాళ్లరేవుకు చెందిన నూలు రాజేశ్వరి ఇంటి ఆవరణలోకి ప్రవేశించి ఆమె మెడలో గొలుసు, నల్లపూసల తాడును దొంగిలించుపోయిన కేసులో తాళ్ళరేవు నందిరేవు పేటకు చెందిన పోతాబత్తుల యేసురాజును అరెస్టు చేసినట్లు తెలిపారు. అతని నుంచి రెండున్నర కాసుల బంగారం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈనెల 22వ తేదీన కోరంగి ఎల్లమ్మ తల్లి ఆలయంలో హుండీ దొంగిలించిన కేసులో కాకినాడ రూరల్ మండలం తూరంగి శివారు పగడాల పేటకు చెందిన బొడ్డు అంజిబాబును అరెస్టు చేసినట్లు తెలిపారు. అతని నుంచి రూ.160 నగదు, సఖినేటిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగిలించిన ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అంజిబాబుపై కాకినాడ క్రైమ్, ఇంద్రపాలెం స్టేషన్లలో పలు నేరాలపై ఆరు కేసులు ఉన్నట్లు వెల్లడించారు. ఇద్దరిని కోర్టులో హాజరుపరచగా జ్యుడిషియల్ రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మురారి గ్రామ శివారు పోలవరం గట్టున ఒక గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. గ్రామ విఆర్ఒ ఇచ్చిన ఫిర్యాదుతో సంఘటనా ప్రాంతాన్ని ఎస్ఐ శివనాగు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరి వేసుకుని మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందన్నారు. నీలం, పసుపు, నలుపు రంగులతో పొడుగు చేతులు షర్ట్, బిస్కెట్ రంగులో ప్యాంట్ వేసుకున్నట్లు తెలిపారు. మృతదేహం పక్కనే ఒక సైకిల్ పడిపోయి ఉందని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతిని యొక్క సమాచారం తెలిసిన వారు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ నెంబర్ 9440796529 కానీ, తన నెంబర్ 9440904841ని సంప్రదించాలని కోరారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సోమవారం ఎస్ఐ వి.మౌనిక ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.10,250 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్కూటీ ఢీకొనడంతో మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - ముమ్మిడిరం

రోడ్డు దాటుతున్న మహిళను స్కూటీపై వెళ్తున్న ఇద్దరు యువతులు ఢీ కొట్టడంతో ఆ మహిళ తీవ్రంగా గాయపడింది. ముమ్మిడివరం మండలం అనాతవరం కైరం వారి వీధికి చెందిన పేరూరి శ్రీమహాలక్ష్మి తన తోటి కోడలు లక్ష్మితో కలిసి కొమరగిరి శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తోంది. అనాతవరంలో రోడ్డు దాటుతుండగా స్కూటీపై వెళుతున్న మెడికల్ విద్యార్థినిలు ఢీకొట్టడంతో శ్రీమహాలక్ష్మి తీవ్రంగా గాయపడింది. ఆమెను అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాడుతున్న ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి - సీతానగరం

రఘుదేవపురం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురుని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. రఘుదేవపురం లంక పొలాలకు వెళ్లే మార్గంలో పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకున్నారు.వారి నుంచి పేక ముక్కలతో పాటూ రూ.9,250 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని సీతానగరం ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు.

అత్యాచారం కేసులో నిందితునికి 11 ఏళ్ల జైలు, జరిమానా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అత్యాచారం కేసులో నిందితునికి 11 ఏళ్ల జైలు, రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని పోలీసులు తెలిపారు. రాజమహేంద్రవరంలోని పిఅండ్‌టి కాలనీకి చెందిన వాసంశెట్టి దేవికుమార్ లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన బాధితురాలుని పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా అనుభవించాడు. ఈ మేరకు బాధితురాలు ప్రకాష్ నగర్ పోలీస్‌కు 2023 మే 20న ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ. పి.ప్రేమరాజు ఈ మేరకు కేసు నమోదు చేశారు. అనంతరం ఇన్‌ఛార్జి సిఐ ఎస్.లక్ష్మణరావు కేసుపై దర్యాప్తు చేశారు. నిందితుని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. అనంతరం వచ్చిన సిఐ పిఇ.పవన్‌కుమార్‌రెడ్డి ఛార్జిషీటు దాఖలు చేసినారు. ప్రస్తుత సిఐ ఆర్ఎస్‌కె.బాజీలాల్ సాక్ష్యాదారాలు సేకరించి కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితునిపై నేరం రుజువు కావడంతో 8వ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స కోర్టు న్యాయమూర్తి వై.బెన్నయ్య వాసంశెట్టి దేవికుమార్‌కు జైలు, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. నిందితులకు శిక్షణ పడేలా చర్యలు తీసుకున్న సెంట్రల్ జోన్ డిఎస్‌పి కె.రమేష్‌బాబు, ప్రస్తుత ప్రకాష్ నగర్ సిఐ బాజీలాల్, అప్పటి సిఐ పిఇ.పవన్‌కుమార్‌రెడ్డి, కానిస్టేబుల్ రమేష్‌ను ఎస్‌పి అభినందించారు.

యానాం వార్తలు

మునిస్వామితో చర్చిస్తున్న ఎంఎల్ఎ శ్రీనివాస్ అశోక్

పలు సమస్యలపై ఎంఎల్ఎ సమీక్ష

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆర్ఎఒ మునిస్వామితో సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ అశోక్ మాట్లాడుతూ ప్రజలు, భక్తుల కోరిక మేరకు వెంకటేశ్వర స్వామి వారి ఆభరణాలు పాత కమిటీ నుంచి సంబంధిత అధికారులు స్వాధీనం చేసుకుని ప్రజలకు ఆ నగలు చూపించాలన్నారు. కళ్యాణోత్సవంలో ఉత్సవ కమిటీ సభ్యుల సమక్షంలో స్వామివారికి ఆభరణాలను ధరింపచేయాలన్నారు. వీటిపై అధికారులు నిర్లక్ష్యం తగదన్నారు. కనకాలపేట డంపింగ్ యార్డ్‌ను ప్రజలకు ఇబ్బంది లేని చోట ప్రభుత్వం స్థలం కేటాయించి అక్కడికి తరలించాలన్నారు. మెట్టకూరు గణపతి నగర్‌లో నిర్మిస్తున్న రోడ్డుకు సంబంధించి ఇరువర్గాలకు ఇబ్బంది లేకుండా సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఆదిత్యలో ముగిసిన అతిథి ఉపన్యాసం

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య యూనివర్సిటీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో 'డే వోప్స్ భవిష్యత్తు, ధోరణులు, సవాళ్లు-కెరీర్ రోడ్ మాప్'పై జరిగిన అతిథి ఉపన్యాసం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా డెలాయిట్ సంస్థ ప్రతినిధి వై. గీతిక మాట్లాడుతూ 'డే వోప్స్ సంబంధిత కొత్త ధోరణులు, అప్‌డేట్లు, ఈ రంగంలో ఎదురయ్యే సవాళ్ళను వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ (అకాడెమిక్స్) డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, డీన్ డాక్టర్ డోలా సంజయ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం హెడ్ డాక్టర్ మాకినీడి రాజాబాబు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి.శివసత్య ప్రసాద్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

గోగులమ్మ జాతరలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని కట్టమూరులో జరిగిన గోగులమ్మ అమ్మ వారి జాతర సందర్భంగా సోమవారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కుడా ఛైర్మన్ తుమ్మలబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గోగులమ్మ జాతర కమిటీ సభ్యులు, జనసేన నాయకులు దూళ్ల నాగేంద్ర, అడపా శివ, మాదిరెడ్డి రామకష్ణ, అడపా గంగాధర్, చన్నం వెంకన్న బాబు, మాదిరెడ్డి దత్త కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక తిరుమలేశ లే అవుట్ వద్ద ఉన్న ఆక్రమణలను తొలగించి డ్రెయినేజీ, రోడ్డు నిర్మాణం చేయాలని బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ జుత్తుక నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ జెవిఆర్.రమేష్‌కు ఆయన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకవరం రోడ్డు ఎంట్రన్స్‌లోని రోడ్డును కొందరు ఆక్రమించారని అన్నారు. సర్వేయర్ ఇచ్చిన మార్కింగ్ వరకు ఖాళీ చేయించి డ్రెయినేజీ, రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు.

ఉప్పాడలో చికెన్ పంపిణీ

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ రింగ్ రోడ్డు సెంటర్లో వెంకాబ్ చికెన్ కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం ఉడికి వండిన చికెన్, గుడ్లను ఉచితంగా పంపిణీ చేశారు. బర్డ్ ఫ్లూ వైరస్ కోళ్లకు సోకిందని, చికెన్ కొనేందుకు కొనుగోలుదారులు లేకపోవడంతో ఉచిత చికెన్ పంపిణీ కార్యక్రమం చేపట్టామని కంపెనీ సిబ్బంది తెలిపారు. డబ్ల్యూహెచ్ఒ ఆదేశాల ప్రకారం 70 డిగ్రీల కంటే ఎక్కువ వేడిలో చికెన్, గుడ్లు ఉడికించడంతో బర్డ్ ఫ్లూ వైరస్ చనిపోతుందని, ఆ చికెన్‌ను తినవచ్చున్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి (మోటార్ వెహికల్స్ ట్రిబ్యునల్) వారి కోర్టు, రాజమహేంద్రవరం, తూ॥గో॥జిల్లా
M.V.O.P. No. 693/2023

బిట్వీన్:
పిల్లా దుర్గ సురేంద్ర -పిటీషనర్
మరియు
శ్రీ సేవా భూలోకం అండ్ అదర్స్

టు: ఏలూరి పద్మావతి, W/o. వెంకటేశ్వరరావు, 38 సం॥రాలు, ఓనర్ ఆఫ్ లారీ బేరింగ్ నెం. ఎపి 05 టిడి-7988, డోర్ నెం. 5-19/1, నడవీధి, వడిశలేరు గ్రామం, రంగంపేట మండలం. -2వ రెస్పాండెంట్

పై నెంబరు పిటీషన్‌లో 2వ రెస్పాండెంట్ అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పివేయుచున్నారు. కావున **ది. 03-03-2025వ సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా లేక ప్లీడరు ద్వారా గాని పై పిటీషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకోవలెను. లేని యెడల సదరు పిటిషన్‌ను పరిహారములను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

జి.మహాలక్ష్మి
పి.శ్రీనివాస్, అద్వకేట్స్
రాజమహేంద్రవరం రాజమహేంద్రవరం
24-2-2025 సెల్: 9440223711

IN THE COURT OF THE IV ADDITIONAL JUNIOR CIVIL JUDGE, KAKINADA
I.A. No. 602/2023 in O.S. No. 805/2023

Between:-
Nellore Sumathi ...Petitioner/Plaintiff
and
Akula Veera Venkata Rama krishna & Others ...Respondants/Defendants

To.
R-1: Akula Veera Venkata Rama Krishna S/o. Narasimha Rao, hindu, Employee, D.No. 53-1-42, Puramvari Street, Near Satemma Talli Stree, Corner Building, Jagannaikpur, Kakinada.

పై నెంబరు పిటీషనులో 1వ రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టు వారు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.13-03-2025** సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ **10.30** ని॥లకు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియ పర్చుకోవలెను., లేనియెడల పై పిటీషను మీ పరోక్షమున తీర్మానించ బడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

బోయనపల్లి రాధాకృష్ణ
ఎ.అనిల్ కుమార్ రాజా
అద్వకేట్స్, డోర్‌నెం6-1-9, జవహర్‌వీధి, కాకినాడ,కాకినాడజిల్లా,
సెల్.9440323951

In the Court of the VIth Additional District Judge at Kakinada
A.S. No. 138/2019

Between:
Machavarapu Naresh Kumar ...Appellant
AND
Tavitiki Suguna Kumar ...Respondent

To:
Family members of (late) Tavitiki Suguna Kumar, S/o. Prabhudas, Christian, Education and Business, R/o. D.No. 70-3-48/4, Vidyuth Nagar, Road No.1, Kakinada.

పై నెంబరు అప్పీలు దావాలో రెస్పాండెంటు కుటుంబ సభ్యుల చిరునామాకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను సదరు రెస్పాండెంట్ కుటుంబ సభ్యులు తీసుకొనకుండగా evade చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 10-3-2025వ సం॥ తేదీకి వాయిదా వేసినారు.** సదరు రెస్పాండెంట్స్ కుటుంబ సభ్యులు ఆరోజు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై అప్పీలు దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

భమిడిపాటి వెంకట రామశర్మ
డి.వి.యస్.యస్.సుజన
న్యాయవాదులు, కాకినాడ
సెల్: 9246589838

మహారాజశ్రీ రాజమండ్రి ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టులో
I.A. 574/2024
A.S.S.R. 3046/2024

Between:
వాడ్రేవు శ్రీనివాస ప్రసాదరావు
and Another
-పిటీషనర్లు (అప్పిలెంట్లు)
మరియు
Power Grid Corporation of India, rep. by its Project Manager V.Venkateswara Rao, Rajahmundry and another -రెస్పాండెంట్స్

To: **1st Respondent:**
Power Grid Corporation of India, rep. by its Project Manager, V.Venkateswara Rao, R/o. Flat No. 4, D.No. 82-6-5/3, Tanuja Residency, 3rd Left Street, Vidyut Colony, Rajamahendravaram.

నోటీసు

సదరు పై నెంబరు గల పిటీషనులో మీకు ఎన్నిమార్లు నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారని మరియు మీ కంపెనీ ఆ అడ్రస్సులో లేదని, ఎక్కడ ఉన్నది తెలియదని నోటీసులపై ఎండార్స్‌మెంటు వచ్చినందున శ్రీ కోర్టు వారు మీకు నోటీసు పత్రికా ముఖంగా జారీ చేయమని ఉత్తర్వులు యిచ్చినందున మీకు నోటీసు "ప్రజాశక్తి" రాజమహేంద్రవరంలో సర్కులేట్ అయ్యే పేపరులో ప్రచురించి పై పిటీషను **ది. 18-3-2025వ సం॥రం తేదీకి వాయిదా అయి ఉన్నదని, వాయిదా రోజు ఉదయం 10.30 ని॥లకు** మీరు కోర్టుకి స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియచేసుకొనవలసినదిగా యిందుమూలముగా మీకు తెలియచేయడమైనది.

క్రొవ్విడి వెంకటరావు
పిటీషనరు తరపు న్యాయవాది
రాజమండ్రి రాజమహేంద్రవరం
తేది:24-2-25 సెల్: 9440254625